నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు మరమ్మతులు చేపట్టినందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పీర్జాదిగూడ సెక్షన్ ఏఈ ఆర్.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రతాపసింగారం వ్యవసాయ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జవహర్‌నగర్: 11కేవీ చెన్నాపూర్ విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీఆర్‌పీఎఫ్, అరుంధతినగర్, ఫరూక్‌బస్తీ, మల్కారం, గోశాల, డంపింగ్‌యార్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు.

సీఎంకు కలెక్టర్ స్వాగతం



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లాలోని శామీర్‌పేట జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ విస్తరణలో భాగంగా 1.75 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించనున్న కొత్త ప్లాంట్ (ఫెసిలిటీ) నిర్మాణానికి శంకుస్థాపన చేయటానికి మంగళవారం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సైంటిస్టులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నాయకులు

మేడ్చల్: మేడ్చల్‌కు చెందిన అక్షయ సమృద్ధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పేదవిద్యార్థుల చదువుల కోసం ఇబ్బందులు పడొద్దని సాయం అందిస్తున్నామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. వివిధ పార్టీల నాయకులు శ్రీహరి, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున్‌స్వామి, విష్ణుచారి, శ్రీనివాస్‌గుప్తా, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో హద్దురాళ్ల పరిశీలన



హద్దురాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

పోచారం: కాచివానిసింగారంలోని ప్రభుత్వ స్థలంలో హద్దురాళ్లను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. సర్వేనెంబర్ 66లోని ప్రభుత్వ స్థలంలో 6.12 గుంటల భూమిని ఓ వెంచర్ నిర్వాహకులు ఆక్రమించారని పలువురి ఫిర్యాదుతో అధికారులు సర్వే చేపట్టారు. ఈ క్రమంలో ముందుగా హద్దురాళ్లను పరిశీలించారు. పూర్తిస్థాయిలో డిజిటల్ సర్వే నిర్వహించాల్సి ఉంది. సర్వే అధికారులు బలిరామ్, సత్యమ్మ, రూప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై దాడి సరికాదు

ఘట్‌కేసర్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపు బాలరాజ్‌యాదవ్, మండల అధ్యక్షుడు సంజీవముదిరాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలో వారు మాట్లాడుతూ.. విమర్శలు చేస్తే న్యాయపరంగా ఎదుర్కోవాలని, దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శాస్త్ర సాంకేతిక విభాగం ద్వారా అమలు చేస్తున్న పిల్లల కేంద్రిత అవగాహన కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీలో ఉన్న విద్యా కోర్సులు, పరిశోధన, ఉద్యోగ మార్గాలపై విద్యార్థులకు బోధించినట్లు వివరించారు.

ఐటీ విస్తరణపై ఫోకస్

తూర్పున పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి ● నగరంలో సమాంతర అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ

> నగర శివారుల్లో పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కొత్త పరిశ్రమలతో వందలాది మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, వేలాది కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.
> – సాక్షి,మేడ్చల్ జిల్లా



ఇన్‌చార్జ్ మంత్రి ప్రత్యేక చొరవ

హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌తో పాటు హైదరాబాద్ నలువైపులా పారిశ్రామిక పార్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఐటీశాఖ మంత్రి కావడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాపై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నట్లు తెలుస్తోంది.

పెరగనున్న పెట్టుబడులు..

గత ప్రభుత్వం గ్రిడ్ పాలసీలో భాగంగా ఉప్పల్ జెన్‌ప్యాక్ వద్ద 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీపార్కుకు శ్రీకారం చుట్టగా.. నగరానికి ఉత్తరాన కండ్లకోయలో గేట్‌వే ఐటీపార్కుకు చర్యలు తీసుకుంది. వీటిని వేగవంతం చేయడంతో పాటు నగరానికి తూర్పు దిశలో భాగంగా ఘట్‌కేసర్ మండలం మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇదే మండలంలోని పోచారంలో దాదాపు 450 ఎకరాల విస్తీర్ణంలో కొనసాగుతున్న ఇన్ఫోసిస్‌ను మరో రూ.750 కోట్ల పెట్టుబడులతో మరింత విస్తరింపజేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

సీఎం దావోస్ పర్యటనతో..

గత జనవరిలో సీఎం దావోస్‌లో పర్యటించిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇన్ఫోసిస్ విస్తరణపై వారితో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే పోచారంలో ఇన్ఫోసిస్ ఏర్పాటుతో వందలాది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించింది. ఇన్ఫోసిస్‌ను మరింత విస్తరింపజేయడం ద్వారా కొత్తగా వందలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. నగరానికి తూర్పున ఐటీ రంగం విస్తరణలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ భూముల వివరాలపై ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఆరా తీస్తోంది.

మెరుగైన పారిశ్రామిక ప్రగతి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు సానుకూల చర్యలతో పారిశ్రామిక ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా పరిశ్రమల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. మేడ్చల్ జిల్లాలో 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 9 నెలల కాలంలో రూ.380 కోట్ల పెట్టుబడులతో పారిశ్రామికవేత్తలు 130 కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

నూత పారిశ్రామిక విధానంతో అనుమతులు సులభం..

పరిశ్రమల శాఖ నూతన పారిశ్రామిక విధానానికి అనుగుణంగా సకాలంలో అవసరమైన అనుమతులను మంజూరు చేయడం వల్ల విజయవంతమైనట్లు జిల్లా పరిశ్రమలశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో కొత్తగా మరో 783 భారీ, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను రూ.12,523 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ కొత్త పరిశ్రమల ఏర్పాటుతో మేడ్చల్ జిల్లాలో మరో 46,356 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు అంచనా వేస్తున్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో మేడ్చల్ జిల్లా ఐటీహబ్‌గా మారుతోంది.

- ప్రస్తుతం ఉన్న పరిశ్రమలకు తోడుగా మేడ్చల్‌లో హాస్పిటల్ అండ్ హెల్త్ ఇండస్ట్రీ, శామీర్‌పేట్‌లో అమ్యూజ్‌మెంట్ అండ్ ఎగ్జిబిషన్ ఇండస్ట్రీ, కీసరలో నాలెడ్జ్ అండ్ సైన్స్ ఇండస్ట్రీ, ఘట్‌కేసర్‌లో ఐటీ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండస్ట్రీ, గుండ్లపోచారంలో ఫార్మా అండ్ బల్క్ డ్రగ్స్ ఇండస్ట్రీలు రానున్నాయి.
- మేడ్చల్ జిల్లా ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల పరిధిలోని పోచారం, ఘట్‌కేసర్, ఉప్పల్, శామీర్‌పేట్, మేడ్చల్, కీసర, బోడుప్పల్, చెంగిచర్ల తదితర ప్రాంతాల్లో పరిశ్రమలకు సంబంధించిన భూసేకరణకు టీఎస్‌ఐఐసీ ఏర్పాట్లు చేస్తోంది.

విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు

మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

శామీర్‌పేట్: గురుకులాల్లో చదివే విద్యార్థులకు అవసరమైన వసతులను సమకూర్చాలని సంబంధిత అధికారులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శామీర్‌పేట మండల పరిధిలోని తుర్కపల్లిలోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర స్కూల్, జూనియర్ కాలేజీలను సందర్శించి నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్‌ట్యాంక్ మరమ్మతుల వల్ల నీటిసరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, డోర్లు, ఫ్యాన్లు భోజనం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్‌కు విద్యార్థులు వివరించారు. నీటిట్యాంక్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, భోజనం, టిఫిన్ తయారుచేసే సామగ్రి కోనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు, ఈగలు రాకుండా శానిటేషన్ పక్కగా ఉండాలని సూచించారు. శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి డీజీఎంకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జలమండలి డీజీఎం బ్రహ్మారెడ్డిని మంగళవారం నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగారంలో కొన్ని కాలనీలకు 6 రోజులకోసారి నీరు వస్తుందని, దీంతో నీటి కొరత సమస్య ఎక్కువైందన్నారు. అన్ని కాలనీలకు రోజు విడిచి రోజు నీరు అందించాలని ఆయన కోరారు. జలమండలి మేనేజర్ సాయికిరణ్‌గౌడ్, నాగారం మాజీ కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, హరిబాబు, సుమిత్రసురేష్, కాంగ్రెస్ నేతలు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పెట్రోల్ బంక్ కేటాయింపు



స్థల పరిశీలన చేస్తున్న మండల ప్రెసిడెంట్ జ్యోతి

మేడ్చల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా పెట్రోల్ బంక్‌లను కేటాయిస్తున్నట్లు మండల ప్రెసిడెంట్ జ్యోతి అన్నారు. అత్వెల్లిలో మహిళలు నిర్వహించనున్న పెట్రోల్ బంక్ కోసం మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఏపీఎం శేఖర్, సీసీలు జ్యోతి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'ఇన్ఫోసిస్ వేదిక స్కాలర్స్'లో విద్యార్థినుల ప్రతిభ

కీసర: ఇన్ఫోసిస్ వేదిక స్కాలర్స్‌లో భాగంగా ఇన్ఫోసిస్ నిర్వహించిన ఎస్‌ఐ రైటింగ్ కమ్ ప్రజెంటేషన్ పోటీలో కీసర మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నవ్య ప్రథమ బహుమతి, నవ్యశ్రీ ద్వితీయ బహుమతి, సుచిత్ర తృతీయ బహుమతులు అందుకున్నారు. విజేతలకు అమెజాన్ బహుమతి వోచర్లను అందజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజాత, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ఘట్‌కేసర్: తెలంగాణలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కదంతొక్కి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అవుషాపూర్ వీవీఆర్ గార్డెన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఎన్నిక ఏదైనా విజయం మనదే కావాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల చెవిలో పువ్వు పెడుతుందని, బీసీల పేరుతో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మతం పేరుతో రిజర్వేషన్లు గతంలో మేము అడ్డుకున్నామని, ప్రస్తుత ప్రభుత్వ తీరుతో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ, ఓటుశాతం పెరిగిందని, కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యకర్తల కృషితో 2027 ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కీసర: మండల పరిధిలోని గ్రామాలకు ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు జీఎస్ఆర్ ట్రోఫీ సెషన్-2 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా జీఎస్ఆర్ ట్రోఫీ సెషన్-2 పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు గుర్రం శ్రీధర్‌రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు గోరంటి ప్రవీణ్, గ్రామ అధ్యక్షులు బాలరాజు, ఉపాధ్యక్షులు సుమన్, ప్రధాన కార్యదర్శి గణేష్, యూత్ ప్రధాన కార్యదర్శి మహేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి డివిజన్‌కు రూ: 4.21 కోట్ల నిధులు !

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి రూ.4.21 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి మంజూరుపత్రాలను అందజేశారు. చర్లపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు, మీనాక్షినగర్, ఆఫీసర్స్‌కాలనీ, నాగార్జుననగర్ కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.51 కోట్లు, ఈసీనగర్, బీఎన్‌రెడ్డినగర్‌లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.46 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాల్‌రెడ్డి, విఠల్‌నాయక్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉద్రిక్తతలకు దారితీసిన బోనాల చెక్కుల పంపిణీ



అల్వాల్ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో చెక్కుల పంపిణీలో ఘర్షణ



మాట్లాడుతున్న ఏసీపీ బాల గంగిరెడ్డి

అల్వాల్: బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉద్రిక్తలకు దారితీసింది. ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఏర్పడిన విభేదాలు ఒక్కసారి గుప్పుమన్నాయి. మంగళవారం అల్వాల్ బాలాజీ వేంకటేశ్వరఆలయంలో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రోటోకాల్ పేరుతో ఘర్షణ పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు మల్కాజిగిరి, అల్వాల్ ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇవి ఎంతవరకు దారితీస్తాయేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సైతం అదుపు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు కలిసి ఉన్న నాయకులు పార్టీ మారడంతో పరస్పరం బద్ధ శత్రువులుగా మారి దాడులు చేసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



చీర్యాల సాయినగర్‌లో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చీర్యాల సాయినగర్‌లో ప్రతి ఒక్కరూ ఇంటింటికీ ఒక మొక్క నాటి వాటిని పరిరక్షించాలనే ఉద్దేశంతో కాలనీలో ప్రచారం నిర్వహించారు. అనంతరం తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కాలనీకి ఆనుకుని ఉన్న ఓపెన్ డ్రైనేజీ సమస్య, పలు సమస్యలను అడిగి తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. డీఈఈ బాలమురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, కార్యాలయ సిబ్బంది, స్నేహ మహిళా సంఘం మహిళలు, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

మల్లాపూర్: రాష్ట్రంలో ఈఎస్ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల 3 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని లేదంటే డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరించారు. మంగళవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుకుమార్ అధ్యక్షతన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహా హజరై మాట్లాడారు. నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, నర్సింగ్ సిబ్బంది, వార్డు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు, టెక్నీషియన్లు, డీఈఓలు తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న వారందరికీ 3 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్ట్ చట్టం ప్రకారం 7వ తేదీ లోగా కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. యూనియన్ నాయకులు ధన్‌రామ్, క్రాంతి, సుకన్య, లింగమ్మ, పద్మ, భాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లతో విద్యార్థుల్లో ప్రతిభ మెరుగు



జాతీయ సెమినార్‌లో విద్యార్థులు

ఉప్పల్: 'క్రిస్పర్ టెక్నాలజీ అండ్ జీన్ ఎడిటింగ్'పై రెండ్రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను జూలై 14, 15 తేదీల్లో ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్‌సైన్స్, హిమీడియా లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ జాన్ కలరక్కల్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డిలు తెలిపారు. రెండ్రోజుల పాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తుందన్నారు.



అయ్యప్ప గుడి సమీపంలో హెచ్చరిక బోర్డు



హౌజింగ్ బోర్డు కాలనీలో రోడ్డు పక్కనే వ్యర్థాలు

నాడు అవార్డు.. నేడు బేజారు !

- ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాల పారబోత
- దుర్వాసన వెదజల్లుతున్న కాలనీలు

మేడ్చల్: దక్షిణాదిలో చిన్న పట్టణాల విభాగం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డు పొందిన మేడ్చల్ మున్సిపాలిటీ నేడు వ్యర్థాల మయంగా మారుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, ఆటోలు, అధిక సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నా.. చెత్త మాత్రం ఎక్కడపడితే అక్కడ కనిపిస్తోంది.

◆ గతంలో వార్డుల్లో ఎక్కడ చెత్త కనబడినా కార్మికులు ఆటోలు, ట్రాక్టర్లు తీసుకొచ్చి వాటిని శుభ్రం చేసేవారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించి చెత్త వేయకుండా జాగ్రత్తలు చేపట్టేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ పట్టణంలోని 23 వార్డుల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. విలీన గ్రామాలు అత్వెల్లి, కిష్టాపూర్, రాయిలాపూర్, పూడూర్‌లలో ఈ సమస్యను పట్టించుకునే వారే లేకుండా పోయారు.

సంతల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు...

మేడ్చల్ పట్టణంలోని 23 వార్డుల్లో అన్ని కాలనీలలో ఏదో ఒకవారం సంత జరుగుతుంది. వారాంతపు సంతలలో వ్యాపారాలు పెట్టుకునే వారి నుంచి తైబజారు రుసుము తప్పకుండా వసూలు చేస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు కొనసాగడం వల్ల మరుసటి రోజు సంత జరిగిన ప్రాంతంలో చెత్తను మున్సిపల్ కార్మికులు శుభ్రం చేసేవారు. ప్రస్తుతం సంతలు జరిగిన 3-4 రోజుల తర్వాత కూగా వ్యర్థాలను తొలగించకపోవడం గమనార్హం.

◆ ప్రధానంగా పట్టణంలోని కేఎల్ఆర్, వినాయక్‌నగర్, మున్సిపల్ కార్యాలయం ఉన్న హౌజింగ్ బోర్డు కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎన్‌జీఓస్, బాలాజీనగర్, అత్వెల్లి ముస్లిం బస్తీ, ఎస్సీబస్తీ, రాఘవేంద్రనగర్, ఎల్లమ్మతోట, సరస్వతీనగర్, రైల్వేకాలనీ, కిష్టాపూర్ రోడ్డు, పూడూర్ రోడ్డు, గిర్మాపూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చెత్త సమస్య అధికంగా ఉంది.

శానిటరీ విభాగం పటిష్టం చేయాలి..

పారిశుద్ధ్యం, పరిశుభ్రత చూసే మున్సిపల్ శానిటరీ విభాగం మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తరలించే పద్ధతులలో మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం వార్డుల్లో ఆఫీసర్లు, జవాన్లు పరిశుభ్రత కోసం పనిచేస్తున్నా.. మరింత దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు.

అపరిశుభ్రంగా రోడ్లు..

ఇళ్ల నుండి చెత్త సేకరణకు పేయిడ్ పద్ధతి ఉండటంతో పరిస్థితి భగానే ఉన్నా.. రోడ్లపై చెత్త డబ్బి పక్కనే నిల్వ ఉంచి 2-3 రోజులకోసారి తొలగిస్తుండటంతో రోడ్లు వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతిరోజూ వ్యర్థాలను తొలగిస్తే పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంటాయి.